నమస్తే తెలంగాణ నిపుణ Guide to Excellence
www.nipuna.ntnews.com,
www.facebook.com/ntnipuna
02.
nipuna
Every Wednesday Free Supplement
14 మే 2025
పేజీలు 8

**అనురాధ గార్గ్**

గురుగ్రామ్‌కు చెందిన అనురాధ గార్గ్ ప్రతిష్ఠాత్మక 'మిసెస్ గ్లోబ్ ఇంటర్నేషనల్–2025' విజేతగా నిలిచారు. చైనాలోని షెన్‌జెన్ నగరంలో ఏప్రిల్ 4 నుంచి 13 వరకు నిర్వహించిన ఈ పోటీల్లో 80కి పైగా దేశాలకు చెందిన మహిళలు పాల్గొన్నారు. ఈ టైటిల్‌ను అందుకున్న తొలి భారతీయురాలిగా గార్గ్ రికార్డ్ సృష్టించారు.

# తెలంగాణ ప్రభుత్వ సంక్షేమ పథకాలు - విధానాలు

- కాంగ్రెస్ పార్టీ 2023, సెప్టెంబర్ 17న తుక్కుగూడలో విజయభేరి సభను నిర్వహించింది. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఈ సభకు హాజరయ్యారు. ఈ సందర్భంగా సోనియా గాంధీ ఆరు గ్యారంటీ పథకాలను ప్రకటించారు.
- కాంగ్రెస్ పార్టీ 2023, డిసెంబర్‌లో అధికారంలోకి వచ్చిన తరువాత ఎన్నికల మ్యానిఫెస్టోలో పేర్కొన్న ఆరు గ్యారంటీలను అమలు చేయడం కోసం ప్రజాపాలన కార్యక్రమం 2023, డిసెంబర్ 27న నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో అభయహస్తం ఆరు గ్యారంటీల లోగోను ఆవిష్కరించారు.
- అభయహస్తం ఆరు గ్యారంటీల పథకాలకు అర్హులను గుర్తించేందుకు 2023, డిసెంబర్ 28 నుంచి 2024, జనవరి 6 వరకు గ్రామాలు, పట్టణాల్లో వార్డుల వారీగా సభలు నిర్వహించి దరఖాస్తులు స్వీకరించారు.
- అభయహస్తం గ్యారంటీల అమలు కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలన దరఖాస్తు ఫారాలను విడుదల చేసింది. ఈ పథకంలో మహాలక్ష్మి, రైతుభరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇళ్లు, చేయూత (యువ వికాసం మినహా) ఈ ఐదు గ్యారంటీలకు ఒకే ఒక్క దరఖాస్తు ఫారంను విడుదల చేశారు. ప్రతి పథకానికి వేర్వేరు దరఖాస్తులు చేయనవసరం లేదు. ఏ పథకానికి అర్హులైన వారు ఆ పథకానికి దరఖాస్తు చేసుకోవచ్చు.
- ఈ కార్యక్రమం ద్వారా ప్రభుత్వానికి 1,25,84,383 దరఖాస్తులు అందాయి. వీటిలో 5 గ్యారంటీలకు సంబంధించి 1,05,91,636 దరఖాస్తులు రాగా ఇతర అభ్యర్థనలకు సంబంధించి 19,92,747 దరఖాస్తులు అందాయి.

**అభయహస్తం ఆరు గ్యారంటీలు**

1) మహాలక్ష్మి–
దీనిలో మూడు పథకాలు ఉన్నాయి.

ఎ. ఆర్‌టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం.

బి. పేద మహిళలకు రూ. 500 కే వంట గ్యాస్ సిలిండర్

సి. మహిళలకు నెలకు రూ. 2500 నేరుగా ఖాతాలో జత చేయడం (ఇది అమల్లోకి రాలేదు).

**ఆర్‌టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం:** 2023, డిసెంబర్ 9 (సోనియా గాంధీ జన్మదినం సందర్భంగా)న ప్రారంభం.

- ఈ పథకాన్ని సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు కొండా సురేఖ, సీతక్క, భట్టి విక్రమార్క, ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస రెడ్డితో కలిసి ప్రారంభించారు.
- ఈ పథకం కింద తెలంగాణ రాష్ట్రానికి చెందిన మహిళలు, బాలికలు, ట్రాన్స్‌జెండర్ల కోసం టీజీఎస్‌ఆర్‌టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణాన్ని ప్రారంభించారు.
- మహాలక్ష్మి జీరో టికెట్ పేరుతో అమలు చేస్తున్న ఈ పథకం కింద తెలంగాణ రోడ్డు రవాణా సంస్థ నిర్వహించే నాన్ లగ్జరీ బస్సుల్లో రాష్ట్రంలో ఎక్కడికైనా మహిళలు, బాలికలు, ట్రాన్స్‌జెండర్లు ఉచితంగా ప్రయాణించవచ్చు.
- ఉచిత బస్సు ప్రయాణం కోసం మహిళలు తమ ఆధార్ కార్డు చూపిస్తే సరిపోతుంది. వారికి సంబంధించిన జీరో టికెట్ జారీ చేస్తారు.



- తొలి ఉచిత టికెట్‌ను తెలంగాణకు చెందిన బాక్సింగ్ క్రీడాకారిణి నిఖత్ జరీన్‌కు రేవంత్ రెడ్డి అందజేశారు.
- తెలంగాణ సామాజిక ఆర్థిక సర్వే–2025 ప్రకారం మహాలక్ష్మి పథకం ద్వారా 2023, డిసెంబర్ 9 నుంచి 2025, మార్చి 6 వరకు 149.63 కోట్లకు పైగా మహిళలు ఉచితంగా ప్రయాణించడం ద్వారా రవాణా చార్జీల్లో మహిళలు రూ. 5,005.95 కోట్లు ఆదా చేయగలిగారు.
- ఈ పథకం అమల్లోకి రాకముందు మహిళా ప్రయాణికుల సగటు 40 శాతం ఉండగా ప్రస్తుతానికి మహిళా ప్రయాణికుల సగటు 65.96 శాతానికి పెరిగింది.
- 2025–26 బడ్జెట్‌లో మహాలక్ష్మి (ఉచిత బస్సు ప్రయాణం)కి రూ. 4305 కోట్లు కేటాయించారు. ఈ పథకం ప్రారంభ దశలో సాధారణ బస్సుల్లో 69 శాతంగా ఉన్న ఆక్యుపెన్సీ రేషియో 94 శాతానికి పెరిగిందని ప్రభుత్వం తెలిపింది. మహిళలకు ఇస్తున్న జీరో టికెట్ల డబ్బులను రాష్ట్ర ప్రభుత్వం రీయింబర్స్‌మెంట్ చేస్తుంది.
- **రూ. 500 సిలిండర్:** 2024, ఫిబ్రవరి 27న ప్రారంభం.
- మహాలక్ష్మి వంట గ్యాస్ సబ్సిడీ పథకం రాష్ట్ర వ్యాప్తంగా 2024, ఫిబ్రవరి 27న అమల్లోకి వచ్చింది. జీవో నంబర్ 2 కింద జారీ చేసిన స్పష్టమైన మార్గదర్శకాలు, విధానాల్లో అమలవుతుంది.
- దీన్ని పౌరసరఫరా శాఖ అమలు చేస్తుంది.
- ప్రస్తుతం వంట గ్యాస్ సిలిండర్ ధర రూ. 955గా ఉంది. వినియోగదారులు తొలుత సిలిండర్‌కు పూర్తి మొత్తాన్ని చెల్లించాలి. తరువాత ఆయిల్ మార్కెటింగ్ కంపెనీ (ఓఎంసీ)ల ద్వారా సబ్సిడీ సొమ్ము (రూ. 500 పోగా మిగిలినది) వారి ఖాతాకు బదిలీ చేస్తారు.
- 2025, తెలంగాణ ఆర్థిక సర్వే ప్రకారం ఈ పథకం ద్వారా 2025, ఫిబ్రవరి నాటికి 43 లక్షల కుటుంబాలు ప్రయోజనం పొందాయి. రూ. 433.20 కోట్ల సబ్సిడీ ఇచ్చారు.
- 2025–26 బడ్జెట్‌లో ఈ పథకానికి రూ. 723 కోట్లు కేటాయించారు.

**రైతుభరోసా:** ఈ పథకంలో మూడు ఉప పథకాలు ఉన్నాయి.

ఎ. రైతులు, కౌలు రైతులకు రూ. 15,000 పెట్టుబడి సాయం అందిస్తారు.

బి. వ్యవసాయ కూలీలకు ప్రతి సంవత్సరం రూ. 12,000 అందిస్తారు.

సి. వరి పండించే రైతులకు (సన్న వడ్లకు) క్వింటాలుకు రూ. 500 బోనస్.

**రైతు భరోసా:** 2025, జనవరి 26న ప్రారంభించారు. ఈ పథకం రైతులకు వ్యవసాయ పెట్టుబడి మద్దతు ఇవ్వడం ద్వారా ఉత్పాదకతను మెరుగుపరుస్తుంది.

- 2018–19లో ప్రారంభించిన పంట పెట్టుబడి మద్దతు పథకం రైతు బంధు. ఎకరానికి సీజన్‌కు రూ. 4000 (ఏడాదికి రూ. 8000), తరువాత ఎకరానికి సీజన్‌కు రూ. 5000 (ఏడాదికి రూ. 10,000) ఆర్థిక సాయం అందించారు.
- నూతన ప్రభుత్వం ఏర్పడిన తరువాత వ్యవసాయ ఉత్పాదకత, స్థిరత్వాన్ని పెంచడాన్ని లక్ష్యంగా పెట్టుకుని ఆర్థిక సాయం అందించడంపై ఈ పథకం దృష్టి పెట్టింది.
- రైతు భరోసా కింద పెట్టుబడి మద్దతును ఏడాదికి ఎకరానికి రూ. 12,000కు పెంచారు. ఈ పెట్టుబడి సాయాన్ని సాగుదారులకు చేరేలా చూసుకోవడానికి, వ్యవసాయం చేయని భూములకు మినహాయించి, భూ భారతి పోర్టల్‌లో నమోదైన భూమి ఆధారంగా సాయం అందిస్తున్నారు. ఆర్ ఆఫ్ ఆర్ (రిజిస్టర్డ్ ఆఫ్ ఫారెస్ట్ రైట్స్) పట్టాదారులు కూడా ఈ పథకానికి అర్హులు.
- 2025–26 బడ్జెట్‌లో ఈ పథకానికి రూ. 18,000 కోట్లు కేటాయించారు.

**ఇందిరమ్మ ఆత్మీయ భరోసా**

- 2025, జనవరి 26న ప్రారంభం.
- భూమి లేని వ్యవసాయ కార్మికులకు ఆర్థిక సాయం అందించడం, వారి ఆర్థిక భద్రత, జవనోపాధి, స్థిరత్వాన్ని నిర్ధారించడం లక్ష్యంగా పెట్టుకుంది.
- ముఖ్యంగా ఈ పథకం గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో భూమిలేని రైతులకు ప్రయోజనం చేకూరుస్తుంది.
- అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి సంవత్సరానికి రూ. 12,000 అందిస్తారు. ఈ మొత్తాన్ని 2 సమాన వాయిదాల్లో పంపిణీ చేస్తారు.
- 2025–26 బడ్జెట్‌లో ఈ పథకానికి రూ. 600 కోట్లు కేటాయించారు.

**సన్న వడ్లకు బోనస్:** రాష్ట్రంలోని రైతులకు సన్న రకం వరిని పండించమని ప్రోత్సహించడానికి కేంద్ర ప్రభుత్వ కనీస మద్దతు ధర కంటే అదనంగా రూ. 500 ప్రోత్సాహకాన్ని అందిస్తుంది. తెలంగాణ ఆర్థిక సర్వే– 2025 ప్రకారం 2025, మార్చి 1 నాటికి ప్రభుత్వం 4.48 లక్షల మంది రైతుల నుంచి 23.98 లక్షల మెట్రిక్ టన్నుల సన్న రకం వరిని కొనుగోలు చేసింది. దీని కోసం కనీస మద్దతు ధర కంటే రూ. 1199.22 కోట్లు ఎక్కువ చెల్లించింది. 2025–26 బడ్జెట్‌లో ఈ సన్నరకం వరికి బోనస్ పథకానికి రూ. 1800 కోట్లు కేటాయించారు.

**పోటీ పరీక్షల ప్రత్యేకం ఎకానమీ**

**గృహజ్యోతి పథకం**

- ప్రారంభం– 2024, ఫిబ్రవరి 27
- అమలు– 2024, మార్చి 1 నుంచి
- ఆహారభద్రత కార్డు (తెల్ల రేషన్ కార్డు) కలిగి ఉండి 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగం ఉన్న వారికి ఈ పథకం వర్తిస్తుంది. ఈ పథకం ద్వారా నెలలో 200 యూనిట్ల దాక వినియోగించే అర్హులైన ఇళ్ల యజమానులతో పాటు అద్దెదారులకు గృహలక్ష్మి కింద జీరో బిల్లు ఇస్తారు. 200 యూనిట్లకు మించితే పూర్తి బిల్లు చెల్లించాలి.
- ఇది కేవలం ఒక గృహ అవసరాలకు మాత్రమే వర్తిస్తుంది. ఒకటి కంటే ఎక్కువ గృహాలుంటే ఒక ఇంటికి మాత్రమే వర్తిస్తుంది.
- తెలంగాణ ఆర్థిక సర్వే– 2025 ప్రకారం ఈ పథకంలో సుమారు 50 లక్షల కుటుంబాలు లబ్ధి పొందుతున్నాయి. 2024, మార్చి నుంచి 2025, ఫిబ్రవరి వరకు ఈ పథకం కోసం చేసిన ఖర్చు సబ్సిడీ మొత్తం రూ. 1775 కోట్ల మొత్తాన్ని విద్యుత్ సంస్థలకు సబ్సిడీ కింద చెల్లించింది.
- 2025–26 బడ్జెట్‌లో ఈ పథకానికి రూ. 2080 కోట్లు కేటాయించారు.

**ఇందిరమ్మ ఇళ్లు**

- ప్రారంభం– 2025, జనవరి 26
- ఇల్లు లేని వారికి ఇంటి స్థలం, రూ. 5 లక్షలు, తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల స్థలం ఇస్తారు.
- అర్హులైన కుటుంబాలకు ఇళ్ల నిర్మాణం కోసం రూ. 5 లక్షల సాయం ప్రభుత్వం అందిస్తుంది. ప్రతి సంవత్సరం నియోజకవర్గానికి 3500 చొప్పున రాష్ట్రంలో 4,50,000 ఇళ్లను అందిస్తామని ప్రభుత్వం ప్రకటించింది.
- ఈ పథకం అమల్లో మహిళలకు ప్రాధాన్యం ఇస్తుంది.
- ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తుల ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం ఇళ్లను కేటాయించనుంది. రాష్ట్రంలో ఇప్పటివరకు 80.54 లక్షల దరఖాస్తులు రాగా అధికారులు వాటిని ఇందిరమ్మ ఇళ్ల యాప్‌తో సర్వే చేయించి ఎల్– 1, 2, 3 విభాగాలుగా వర్గీకరించారు.
- 2025–26 బడ్జెట్‌లో ఈ పథకానికి రూ. 12,571 కోట్లు కేటాయించారు.

**చేయూత**

- ఈ పథకం కింద వివిధ వర్గాల వారికి పెన్షన్ సదుపాయాన్ని అందిస్తారు.
- రాజీవ్ ఆరోగ్యశ్రీ ఆరోగ్య బీమాను రూ. 5 లక్షల నుంచి రూ. 10 లక్షలకు పెంచారు.

**చేయూత పెన్షన్**

- సమాజంలోని వివిధ బలహీన వర్గాలను రక్షించేందుకు 'చేయూత' పెన్షన్ పథకాన్ని అమలు చేస్తున్నారు. ఇందులో వృద్ధులు, వికలాంగులు, వితంతువులు, హెచ్ఐవీ/ఎయిడ్స్ రోగులు, ఫైలేరియాతో బాధపడుతున్న వారు, నేత కార్మికులు, కల్లుగీత కార్మికులు, పేద బీడీ కార్మికులు, ఒంటరి మహిళలు, డయాలసిస్ చేయించుకుంటున్న వారు ఉన్నారు.
- ప్రస్తుతం ఈ పథకం ద్వారా లబ్ధి పొందుతున్న పింఛనుదారుల సంఖ్య 42.51 లక్షలు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో 2024, ఏప్రిల్ నుంచి 2025, ఫిబ్రవరి వరకు ఈ పథకంలో ఉన్న లబ్ధిదారులకు రూ. 9532.12 కోట్లు పంపిణీ చేశారు. ఈ పథకం కింద ప్రతి నెలా సుమారు రూ. 982.20 కోట్లు ప్రభుత్వ ఖర్చు చేస్తుంది.
- చేయూత పింఛన్ల కోసం 2025–26 రాష్ట్ర బడ్జెట్‌లో రూ. 14,861 కోట్లు కేటాయించారు.

**రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం**

- ప్రారంభం– 2023, డిసెంబర్ 9
- గతంలో ఆరోగ్యశ్రీ పథకం కింద రూ. 5 లక్షల వరకు ఉచిత వైద్యాన్ని అందించేవారు. ప్రస్తుతం ఈ పథకం కింద ఒక్కో కుటుంబానికి వైద్య చికిత్స కోసం రూ. 10 లక్షల వరకు వైద్య ఆర్థిక కవరేజీ కల్పించింది.
- ఈ పథకంలో 1835 విభిన్న వైద్య ప్యాకేజీలు ఈ పథకం కింద అందుబాటులో ఉన్నాయి. గతేడా 1672 విభిన్న వైద్య ప్యాకేజీలు ఉన్నాయి. 163 నూతన వైద్య ప్యాకేజీలను జోడించారు.
- 2024–25 ఆర్థిక సంవత్సరంలో 2025, జనవరి నాటికి 2,92,667 మంది లబ్ధిదారులు ఉచిత వైద్య చికిత్స పొందారు. దీనికోసం రూ. 1250.6 కోట్లు ప్రభుత్వం కేటాయించింది.
- 2025–26 బడ్జెట్‌లో ఈ పథకానికి రూ. 1143 కోట్లు కేటాయించారు.

**రాజీవ్ యువ వికాసం**

- రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కోసం ఉద్దేశించిన పథకం. ఈ పథకానికి సంబంధించిన దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ 2025, మార్చి 17 నుంచి 2025, ఏప్రిల్ 14 వరకు నిర్వహించారు. ఈ పథకంలో సబ్సిడీతో రుణాలు ఇవ్వనున్నారు.
- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఈడబ్ల్యూఎస్ వారు ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు.
- గ్రామీణ ప్రాంతాల్లో సంవత్సర ఆదాయం రూ. 1,50,000
- పట్టణ ప్రాంతాల్లో సంవత్సర ఆదాయం రూ. 2,00,00 ఉండాలి.
- వ్యవసాయ రంగంలో ఉన్న వారు 21 సంవత్సరాల నుంచి 60 సంవ్సరాల వరకు, వ్యవసాయేతర రంగంలో ఉన్న వారు 21 సంవత్సరాల నుంచి 55 సంవత్సరాలు ఉండాలి.
- లబ్ధిదారుల్లో 25 శాతం మహిళలు ఉండాలి.
- రూ. 50,000 లోపు రుణం పొందితే 100 శాతం సబ్సిడీ లభిస్తుంది.
- రూ. 50,001 నుంచి రూ. లక్షలోపు రుణం పొందితే 90 శాతం
- రూ. 1,00,001 నుంచి రూ. 2 లక్షల్లోపు రుణం పొంది 80 శాతం
- రూ. 2,00,001 నుంచి రూ. 4 లక్షల్లోపు రుణం పొందితే 70 శాతం సబ్సిడీ లభిస్తుంది.
- అర్హులైన లబ్ధిదారులకు 2025, జూన్ 2న స్వయం ఉపాధి పథకాల నిట్ల మంజూరు పత్రాలు ఇవ్వనుంది.
- 2025–26 బడ్జెట్‌లో ఈ పథకానికి రూ. 6000 కోట్లు కేటాయించారు. రికార్డు స్థాయిలో 5 లక్షల మందికి స్వయం ఉపాధి కల్పించేందుకు వీలుగా నిధులు కేటాయించారు.

**నోట్:** 2025–26 రాష్ట్ర బడ్జెట్‌లో 6 గ్యారంటీల కోసం రూ. 56,084 కోట్లు కేటాయించారు.

మిగతా 4వ పేజీలో

పన్నాల శ్రవణ్ కుమార్
ఎకానమీ ఫ్యాకల్టీ
హైదరాబాద్
9866709280

